క్లుప్తంగా

ఆలయ అభివృద్ధికి విరాళం



మంగపేట: మండల కేంద్రంలోని ఉమాచంద్రశేఖరస్వామి ఆలయ అభివృద్ధి కోసం హైదరాబాద్‌కు చెందిన దాత శ్రీకాంత్‌రెడ్డి రూ. ఒక లక్ష నగదును ఆలయ పూజారి నరేష్‌శర్మకు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా పూజారి మాట్లాడుతూ పరమశివున్ని నిత్యం పూజించే మహాభక్తుడైన శ్రీకాంత్‌రెడ్డి కొంత కాలంగా ఉదయాన్నే ఉమా చంద్ర శేఖరస్వామిని ఆలయానికి వచ్చి శివపార్వతులను దర్శించుకుని ఆ పరమశివుడి ప్రతి రూపమైన శివలింగాన్ని దర్శించుకునే వారన్నారు. అదేవిధంగా ఆయన సోమవారం సాయంత్రం ఆలయానికి వచ్చిన ఆయన ఆలయ అభివృద్ధికోసం తన వంతు సాయం అందజేశారన్నారు.

లోతట్టు గ్రామాలకు సాగు నీరందించాలి

ములుగు రూరల్ : లక్నవరం లోతట్టు గ్రామాలకు సాగునీరు అందించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ.అంజాద్‌పాషా అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయంలో సోమవారం తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని లోతట్టు గ్రామాలైన కన్నాయిగూడెం, పంచోత్కలపల్లి, రాయినిగూడెం, దుబ్బగూడెం, లాలయ్యగూడెం, కొత్తూరు, సర్వాపూర్, జగ్గన్నగూడెం, అంకన్నగూడెం, పెగడపల్లి గ్రామాల్లో సుమారు 1500 ఎకరాలు యాసంగి చేస్తున్నారన్నారు. లక్నవరం లోతట్టు ప్రాంతంలో ఆయా గ్రామాల రైతులకు తక్షణమే సాగునీరు ఇవ్వాలని కలెక్టర్‌ను కోరామన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్



టేకుమట్ల: చదువుతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని రాఘవరెడ్డిపేట శివాలయ చైర్మన్ వంగ ప్రభా కర్, ఎమ్మార్పీఎస్ నాయకుడు దూడపాక శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండలంలోని రాఘవరెడ్డిపేట ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతీ విద్యార్థి చక్కగా చదువుకోని ఉన్నత స్థాయికి చేరుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు పద్మ, ఉపాధ్యాయులు వేణు, సుధాకర్, రమేష్, హరిక్రిష్ణ, మొండయ్య, రమేష్, అంగన్‌వాడీ టీచర్లు నిర్మల, వనమాల, గ్రామస్తులు రఘుపతి, పవన్‌కల్యాణ్, పవన్, హరీష్, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ స్వాధీనం

టేకుమట్ల: మండలంలోని కలికోట శివారు మానేరు నుంచి నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా ఇ సుక రవానా చేస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను స్వాధీనం చేసి ట్రాక్టర్ డ్రైవర్, ఓనర్లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు. మండలంలోని గ ర్మిళ్లపల్లి నుంచి సోమవారం అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పెట్రోలింగ్‌లో ఉన్న పోలీసులు పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం ట్రాక్టర్ డ్రైవర్, యజమాని జగన్, ఓదెలుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఇద్దరి రిమాండ్

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు మాజీ ఉప సర్పంచ్ ఆరుట్ల పవన్ కుమార్, మాజీ సర్పంచ్ భర్త వెన్నపురెడ్డి మోహన్ రెడ్డిలను సోమవారం రిమాండ్‌కు తరలించారు. ఎస్సై తమాషా రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం .. కాళేశ్వరం పంచాయతీ పరిధిలోని పూసుకుపల్లి గ్రామ అభివృద్ధి కోసం ఖర్చు చేయాల్సిన నిధులను సొంత అవసరాల కోసం వాడుకోని, నిధులను దుర్వినియోగం చేసినట్లు తెలిపారు. ఈ మేరకు గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వారి ఇద్దరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు.

గుడుంబా పట్టివేత

రేగొండ: అక్రమంగా గుడుంబా విక్రయిస్తుండగా స్వాధీనం చేసుకోని మహిళపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సందీప్ కుమార్ సోమవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన మాడగాని పూలమ్మ ఇంటి వద్ద అక్రమంగా గుడుంబా విక్రయిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం మేరకు దాడులు నిర్వహించినట్లు తెలిపారు. కాగా పూలమ్మ వద్ద 4 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకుని ఆమెపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెల్లడించారు.

చికెన్‌సెంటర్‌లో కోళ్లు చోరీ

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని అంగడిబజార్ సమీపంలోని మదీన చికెన్‌సెంటర్‌లో కోళ్లను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. సోమవారం తెల్లవారు జామున తాళం పగులగొట్టి కోళ్లు చోరీ చేసినట్లు నిర్వాహకుడు సయ్యద్ సమద్ తెలిపారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

తునికాకు ఫ్రూనింగ్ పనులెప్పుడో?

- ఇప్పటికీ రాని అనుమతులు
- ప్రారంభం కాని టెండర్లు

వాజేడు: ఏజెన్సీ ప్రాంతంలో గిరిజన, గిరిజనేతర పేదలకు రెండో ఆదాయం తునికాకు సేకరణ ద్వారా లభిస్తుంది. వ్యవసాయ పనులు ముగియగానే తునికాకు సేకరణపై దృష్టిని సారించి వేసవి ఆదాయం సమకూర్చు కోవడం ఏజెన్సీలోని పేదల ప్రజల జీవన విధానం. ఇప్పటికే తునికాకు ప్రూనింగ్(చిన్న చిన్న పాదలు నరకడం) పనులను చేయాల్సి ఉన్నప్పటికీ మండలంలో ఆ జాడ కానరావడం లేదు. ఫ్రూనింగ్ పనులను ముందస్తుగా చేస్తే తునికాకులు ఎక్కువగా రావడంతో పాటు నాణ్యతను కలిగి ఉంటాయి. అటవీ శాఖ నుంచి ఇంత వరకు తునికాకు ఫ్రూనింగ్ పనులను మొదలుపెట్టలేదు. ఆ పనులను చేపట్టే ఉద్దేశ్యం కూడా ప్రస్తుతం కనబడడం లేదు.

రాని అనుమతులు

తునికాకు ఫ్రూనింగ్ పనులను చేయాడానికి ఇప్పటికే అనుమతులు రావాల్సి ఉంది. కాని నేటి వరకు అనుమతులు రాలేదు. అటవీశాఖ అధికారులు ఆ దిశలో ఎలాంటి ప్రయత్నాలను చేస్తున్నట్లు లేదు. దీంతో తునికాకు సేకరణపైన కూడా ఏజెన్సీ ప్రజల్లో అనుమానాలు వస్తున్నాయి. తునికాకు సేకరణ పనులు ఉంటుంయా?లేదా? అని అనుమానిస్తున్నారు. అలాగే తునికాకు సేకరణ కోసం ఇంత వరకు టెండర్లను వేయలేదని తెలుస్తోంది. టెండర్లు ఇంత వరకు వేయకపోవడంతో తునికాకు సేకరణ జరిగే అవకాశం లేదు. ఇదే జరిగితే వేసవిలో ఏజెన్సీలోని గిరిజన, గిరిజనేతర పేదలకు ఆదాయం లేకుండా పోతుంది. దీంతో పేదలకు ఆర్థికంగా ఇబ్బందులు పడే అవకాశం ఉంది.



తునికాకు పొదలు



తునికాకు సేకరిస్తున్న మహిళ(ఫైల్)

అనుమతులు రాలేదు

తునికాకు ఫ్రూనింగ్ పనుల కోసం ఇప్పటి వరకు ఎలాంటి అనుమతులు రాలేదు. ఉన్నతాధికారుల నుంచి పనులు చేయించమని ఆదేశాలు వస్తే వెంటనే ప్రారంభిస్తాం.

– చంద్రమౌళి, రేంజర్

మద్దతు ధర రూ.25 వేలు చెల్లించాలి

- సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవికుమార్

గోవిందరావుపేట: మిర్చి పంటకు క్వింటాకు రూ.25 వేల మద్దతు ధర నిర్ణయించి కొనుగోలు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బండారు రవికుమార్ ప్రభుత్వాలను కోరారు. మండల పరిధిలోని పస్రాలో సీపీఎం నాయకుడు తుమ్మల వెంకట్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా రవికుమార్ హాజరై మాట్లాడారు. జిల్లాలో 25 వేల ఎకరాలల్లో రైతులు మిర్చి సాగు చేస్తున్నారని తెలిపారు. తెగుళ్లు, వాతావరణంలో వస్తున్న మార్పులు, నకిలీ విత్తనాలు, పురుగుల మందులతో రైతుల తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. మరో వైపు మిర్చికి రూ.12 వేల నుంచి రూ.13 వేల ధర ఉండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారని అన్నారు. ఎకరానికి రూ.రెండు లక్షల నుంచి రూ.మూడు లక్షల ఖర్చు అవుతుందని కనీసం పెట్టుబడులు వచ్చే పరిస్థితి లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యుడు సూడి కృష్ణా రెడ్డి, జిల్లా కార్యదర్శి బీరెడ్డి సాంబశివ, నాయకులు రత్నం రాజేందర్, రఘుపతి రావు, చిట్టిబాబు, వాసు, దావూద్, మల్లా రెడ్డి, రాజేశ్, ఆదిరెడ్డి, చిరంజీవి, దామోదర్, సొమ్మ, చిన్న, దేవయ్య, నరసింహ చారి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బండారు రవికుమార్

పనులు ప్రారంభం



భూమి పూజ చేస్తున్న కమిటీ సభ్యులు

వాజేడు: మండల పరిధిలోని జంగాలపల్లి గ్రామంలో ఈ నెల 26 నుంచి నిర్వహించనున్న శివపార్వతుల కల్యాణ ఉత్సవాలకు సోమవారం పనులు ప్రారంభించారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భూమి పూజ నిర్వహించారు. అనంతరం కల్యాణం కోసం అవసరమైన మండపాలను నిర్మించడానికి ఏర్పాట్లను చేపట్టారు. ఈ కార్యక్రమంలో సోమ సత్యనారాయణ, రాంబాబు రాజు, మల్లయ్య, రాంబాబు, లక్ష్మయ్య, పాపారావు, కృష్ణ, నానబాబు, సీతాలు, సరబాబు రాజు, ప్రసాద్, నాగేశ్వరావు, నానబాబు, పోశాలు చంద్రయ్య ఉన్నారు.

రైతులకు పరిహారం చెల్లించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు, నాయకులు

వెంకటాపురం(కె): మండలంలో బాండ్ మొక్కజొన్న పంటను సాగుచేసి పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని ఆదివాసీ నవ నిర్మాణ సేన వ్యవస్థాపక అధ్యక్షుడు నర్సింహామూర్తి అన్నారు. మొక్కజొన్న పంట నష్టపోయిన రైతులకు న్యాయం చేయాలని కోరుతూ సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ లక్ష్మీరాజయ్యకు అందజేశారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ..



ఉపాధ్యాయులతో విద్యార్థులు

వెంకటాపురం(ఎం): మండలంలోని నర్సింగాపూర్ ప్రాథమిక పాఠశాలలో సోమవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు భోదించారు. డీఈఓగా పొలం రిషి, ఎంఈఓగా సహజ్, హెచ్‌ఎంగా కోట సంజన, ఉపాధ్యాయులుగా అక్షిత, సాంబలక్ష్మి, పార్థివ్, సర్వేష్, రితిక, మణి వ్యవహరించినట్లు ప్రధానోపాధ్యాయుడు సర్వర్ అహ్మద్ తెలిపారు.

రూ.21.15లక్షల ఆదాయం

రేగొండ: కోటంచ జాతర వేలం పాటల ద్వారా రూ.21.15 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ మహేష్, జాతర చైర్మన్ ముల్కనూరి భిక్షపతి తెలిపారు. మార్చి 9నుంచి 16వరకు జరిగే కోటంచ జాతర వేలం పాటలు సోమవారం కొడవటంచ దేవస్థానం వద్ద దేవాదాయ–ధర్మదాయ శాఖ స్పెషల్ ఆఫీసర్ శేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. లడ్డు, పులిహోర రూ.8.50 లక్షలు, కొబ్బరికాయలు రూ. 9.01 లక్షలు, కొబ్బరి ముక్కలకు రూ.1.38 లక్షలు, పూలదండలకు రూ.50 వేలు, బొమ్మలకు రూ.1.01 లక్షలు, స్వీట్ షాప్‌కు రూ.50వేలు, నూనె గురుగులకు రూ. 25 వేలు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తలు శ్రీధర్, ఆకుల రమేష్, బండి మల్లయ్య, ఓంకార్, లింగంపల్లి తిరుపతి, మల్లెబోయిన వేణు, శ్రీపతి సుదర్శన్, సంపత్, ఆలయ సిబ్బంది శ్రావణ్, సుధాకర్ పాల్గొన్నారు.



వేలం పాటలు నిర్వహిస్తున్న అధికారులు

నేడు స్వామి వారి కల్యాణం

మండలంలోని కోటంచ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వాతి నక్షత్రం సందర్భంగా నేడు (మంగళవారం) స్వామి వారి కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ మహేష్, చైర్మన్ ముల్కనూరి భిక్షపతి తెలిపారు. ఈ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

సరోత్తంరెడ్డిని గెలిపించాలి



ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

ఏటూరునాగారం: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ బలపర్చిన సరోత్తంరెడ్డికి ఓటు వేసి గెలిపించాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు వినుకొల్లు చక్రవర్తి, జిల్లా కౌన్సిలర్ మెంబర్ హరిబాబు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పలువురు టీచర్లను కలుసుకొని ప్రచారాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఖమ్మం, నల్గొండ, వరంగల్ ఎమ్మెల్సీ అభ్యర్థి పులి సరోత్తంరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలన్నారు. నాయకులు గాడిచర్ల రాజశేఖర్, కర్ణ సంపత్ పాల్గొన్నారు.

మాజీ సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలు



ములుగు రూరల్: పంటపొలాల్లో కేక్ కట్ చేసి రైతుకు తినిపిస్తున్న బడే నాగజ్యోతి



ములుగు: కీమా నాయక్ కుటుంబ సభ్యులతో పెద్ది సుదర్శన్‌రెడ్డి, లక్ష్మణ్‌బాబు

సాక్షి నెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా మాజీ సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ నాయకులు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మొక్కలు నాటారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంచి పెట్టారు. ఆస్పత్రుల్లో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. పలు చోట్ల రక్తదాన శిబిరాలను నిర్వహించారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన వేడుకల్లో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి పాల్గొన్నారు. అలాగే మల్లంపల్లి మండలంలోని భాగ్యతండాలో పార్టీ అధ్యక్షుడు లక్ష్మణ్ బాబు ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. 2002 సంవత్సరంలో జరిగిన అగ్ని ప్రమాదంలో ఇళ్లుకోల్పోయిన సమయంలో గ్రామంలోని కీమా నాయక్ బిడ్డ పెళ్లికి సమకూర్చిన సామగ్రి, డబ్బులు కాలిపోయాయని అన్నారు. ఆ సమయంలో మేడారం వచ్చిన కేసీఆర్ పరిస్థితిని తెలుసుకొని చలించిపోయారని అన్నారు. ఈ క్రమంలోనే కల్యాణలక్ష్మి పథకానికి తొలి అడుగు పడిందని అన్నారు. అనంతరం కీమా నాయక్‌కు చెందిన నాలుగు తరాల కుటుంబ సభ్యులతో ఫొటో దిగి సంబురాలు నిర్వహించారు.



ఏటూరునాగారం: రక్తదానం చేస్తున్న నాయకులు

ఆర్థిక సాయం

గోవిందరావుపేట: మండలంలోని చల్వాయికి చెందిన అరుణ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో బాధిత కుటుంబాన్ని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ పరామర్శించి రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. పార్టీ మండల అధ్యక్షుడు పాలడుగు వెంకటకృష్ణ, నాయకులు శ్రీనివాస్ రెడ్డి, జెట్టి సోమయ్య, రసపుత్ సీతారాం నాయక్, పన్నాల ఎల్లారెడ్డి, చింత క్రాంతి, తేళ్ల హరిప్రసాద్, నాగలక్ష్మీ, అనిల్ యాదవ్, ఉమాదేవి, నరేందర్ రెడ్డి, పొన్నం సాయి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

ఏటూరునాగారం : మండల కేంద్రానికి చెందిన పండుగ సునీల్ మిషన్ భగీరథలో లీకేజీ పంప్ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం మండలంలోని చింతలమోరీవద్ద లీకేజీ ఉండడంతో రాత్రి వేళలో బైక్‌పై అక్కడికి వెళ్లి మరమ్మతు చేశాడు. తిరుగు ప్రయాణంలో ఇసుక లారీ ఢీకొట్టడంతో సునీల్ తీవ్రంగా గాయపడ్డాడు. తలకు బలమైన గాయాలు తగలడంతో ఏటూరునాగారం సామాజిక ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు ప్రాథమిక చికిత్స అందజేసి 108లో వరంగల్‌కు తరలించారు. అతడి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు.



గాయపడిన సునీల్

అక్రమాలకు పాల్పడితే చర్యలు

ఏఎస్పీ శివం ఉపాధ్యాయ

ఏటూరునాగారం: ఇసుక వ్యాపారులు, లారీల యజమానులు అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని స్థానిక ఏఎస్పీ శివం ఉపాధ్యాయ అన్నారు. సోమవారం మండలంలోని చిన్నబోయినపల్లి వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు, ఇసుక లారీలను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇసుక తరలింపులో నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. జిల్లా పరిధిలో ఇసుక క్వారీల పై నిఘా ఏర్పాటు చేయడం జరిగిందని చెప్పారు. జీరో బిల్లులు, డబుల్ ట్రిప్, అదనపు లోడ్, నకిలీ బిల్లులు, తప్పుడు వాహనంలో రవాణా, తప్పుడు గమ్యం స్థానం లాంటి ఉల్లంఘనలకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయన్నారు. క్వారీల్లో అలాగే ఇసుక తవ్వకం జరిపే అవకాశం ఉన్న నదులు, వాగుల వద్ద ఆకస్మిక తనిఖీలు, నిర్వహించడం జరుగుతుందని వెల్లడించారు. సీసీఎస్ సీఐ రమేష్, సీఐ అనుముల శ్రీనివాస్, ఎస్సై తాజొద్దీన్ పాల్గొన్నారు.



చెక్‌పోస్టును పరిశీలిస్తున్న పోలీసులు

సమస్యలు పరిష్కరించాలని వినతి

వెంకటాపురం(కె): మున్నూరు కాపుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం మున్నూరు కాపు సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం నియోజకవర్గ ఇన్‌చార్జ్ ధనపనేని వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం మున్నూరు కాపులను రీ సర్వే చేయాలని డిమాండ్ చేశారు. జనాభా లెక్కల్లో తమను తక్కువగా చూపడం వల్ల రిజర్వేషన్ ప్రతిపాదికన అందించే సంక్షేమ ఫలాలు, ఉద్యోగాలు, రాజకీయ పార్టీల సీట్ల కేటాయింపులో తమకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పడాల రమేశ్, జాపతి శ్యామ్, జల్లిగంపల కళాధర్, కొండూరి ప్రసాద్, శనిగల నర్సింహారావు, బెజ్జని పూర్ణ, బాసాని రమేశ్, రంగయ్య నాయుడు తదితరులు ఉన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఆశ్రమ పాఠశాలలో వైద్యశిబిరం



విద్యార్థులకు వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యాధికారిణి యోషిత, పక్కన డిప్యూటీ డీఎంహెచ్‌ఓ

80 మంది విద్యార్థులకు వైద్యపరీక్షలు

వాజేడు : మండల పరిధిలోని పేరూరు ఆశ్రమ పాఠశాలలో సోమవారం ఏటూరునాగారం ఐటీడీఏ పీఓ చిత్రామిశ్ర ఆదేశాల మేరకు డిప్యూటీ డీఎంహెచ్‌ఓ కోరం క్రాంతికుమార్ ఆధ్వర్యంలో వైద్యాధికారిణి యోషిత వైద్యశిబిరం నిర్వహించారు. పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న సోయం వినీత్(13) జ్వరంతో బాధపడుతూ మృతి చెందిన విషయం పాఠకులకు తెలిసిందే. దీంతో కదలిన యంత్రాంగం పాఠశాలలోని 80 మంది విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఎవరికి కూడా జ్వరం లేదని నిర్ధారణకు వచ్చిన వైద్యసిబ్బంది 20 మంది విద్యార్థులకు జలుబు, దగ్గు ఉండటంతో మందులను పంపిణీ చేశారు. అనంతరం ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. హాస్టల్ పరిసరాలు, వంట గది, తాగునీటిని పరిశీలించారు. హాస్టల్‌లో పనిచేస్తున్న ఏఎన్ఎం విద్యార్థులకు జ్వరం వచ్చినా, అస్వస్థతకు గురైన ప్రథమ చికిత్స చేసి సమీపంలోని పీహెచ్‌సీలో చేర్పించాలని సూచించారు. 5 శాతం ఆల్ఫాసైపర్ మైత్రిన్ దోమల మందును పిచికారీ చేశారు. వైద్య శిబిరంలో ఎన్‌హెచ్ ప్రోగ్రాం ఆఫీసర్ మహేందర్, వేణుగోపాల్, కృష్ణ, సంగీత, కోటిరెడ్డి, అనూష, శకుంతల తదితరులు పాల్గొన్నారు.

ఆరోపణలు చేయడం సరికాదు

ములుగు: తనపై జాకారం మాజీ సర్పంచ్ దాసరి రమేశ్ నిరాధారమైన ఆరోపణలు చేయడం సరికాదని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు లాల్‌పాషా అన్నారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. జాకారంలో తాను గ్రామ పంచాయతీ భూమిని కబ్జాచేసినట్లు మాజీ సర్పంచ్ నిరూపించిన అనంతరం ఏదైనా ఉంటే మాట్లాడాలన్నారు. 40 సంవత్సరాలుగా జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న భూమిలో దుకాణం ఏర్పాటు చేసుకొని జీవనం కొనసాగిస్తున్నానని అన్నారు. రెండు సంవత్సరాల క్రితం జాతీయ రహదారి వైండింగ్ పనుల్లో భాగంగా దుకాణం తొలగించాలని చెప్పిన అధికారుల నిర్ణయం మేరకు నడుచుకున్నానని అన్నారు. ప్రస్తుతం రోడ్డు పనులు పూర్తయి మిగిలిన ప్రదేశంలో మాత్రమే తిరిగి దుకాణం ఏర్పాటు చేసుకుంటున్నానని తెలిపారు. జీవనోపాధికోసం ఏర్పాటు చేసుకున్న దుకాణానికి గ్రామ పంచాయతీ పన్ను సైతం చెల్లిస్తున్నానని అన్నారు. రాజకీయంగా బురదజల్లే ప్రయత్నం చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. గత ప్రభుత్వంలో మాజీ సర్పంచ్ దాసరి రమేశ్ గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తుల నుంచి డబ్బులు తీసుకొని భూమి కేటాయిస్తానని మోసం చేశాడని, ఇప్పటికీ బాధితులు ఆయన చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారని ఆరోపించారు.



మాట్లాడుతున్న లాల్‌పాషా

సాగు నీటికి రైతుల తిప్పలు

- మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

టేకుమట్ల: మండలంలో సాగు నీటి కోసం రైతులకు తిప్పలు తప్పడం లేదని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. మండలంలోని గుమ్మడవెల్లి, రామకిష్టాపూర్(వి) శివారు చలివాగులోని చెక్ డ్యాంలను ఆయన సోమవారం పరిశీలించి మాట్లాడారు. సాగు నీటి కోసం రైతులు పాట్లు పడుతుంటే పాలకులు పట్టించుకోవడం లేదన్నారు. చలివాగు, మానేరుల్లో చుక్కా నీరు లేక, భూగర్భ జలాలు అడుగంటి యాసంగి పంటలను కాపాడుకునేందుకు రైతులు నానా కష్టాలు పడుతుంటే ఎస్సారెస్పీ నీటిని చలివాగులోకి విడుదల చేయాలనే సోయి లేదని మండిపడ్డారు. గత ప్రభుత్వం రైతుల పంటల కోసం చెక్ డ్యాంలను నిర్మించిందన్నారు. ప్రస్తుతం వాగులో నీరు లేవని చెక్ డ్యాంలు సైతం మరో వారంలో ఎండిపోయే పరిస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి వెంటనే ఎస్సారెస్పీ నీటిని చలివాగులోకి విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ రెడ్డి మల్లారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సట్ల రవిగౌడ్, ఆకునూరి తిరుపతి, నాయకులు ఆది రఘు, ఉమేందర్‌రావు, పోతనవేని ఐలయ్య, పింగిళి వెంటేశ్వరరెడ్డి, నర్సింగరావు, మహేష్‌యాదవ్, దేవరాజ్, కోటి, బందెల నరేష్, గువ్వాడి లక్ష్మణ్, నిమ్మల స్వామి పాల్గొన్నారు.



చెక్ డ్యాంను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి